# కథ

# భాయీ ఫోటా

గుండాన జోగారావు

పినాకిని మనసంతా కల్లోలం. ఆమెకు ఏమీ తోచడం లేదు. ఇంటినుండి బయటకు వచ్చినప్పుడు... బట్టలు ఆరవేస్తున్న సమయంలో... తనపై ప్రసరింపబడే ఆ 'చూపుల్ని' ఆమె భరించలేక పోతోంది. ఏం చెయ్యాలి...ఈ పరిస్థితి ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు దారి తీస్తుం దోనని పినాకిని అదురుతోంది... బెదురు తోంది... భయపడుతోంది.

గుండె దడదడ కొట్టుకుంటుండగా ఇంటినుండి వచ్చి తనపని చేసుకుపోతూ... చిక్కటి బలహీనతలా... అలవోకగా ఎదురు వీధిలో ఉన్న ఒంటరిగదివైపు చూసి... గబుక్కున ఇంట్లోకి దూరి పోతోంది.

ఆ ఒంటరిగదిలో అఖిల్ ఉంటున్నాడు. యూనివర్శిటీ స్టూడెంటు. పినాకిని కనిపిస్తే చాలు...అలా ఉండి పోతాడు. సెకండ్లు నిముషాలవుతాయి...నిముషాలు గంటలు...ఇది వారిద్దరి మధ్య గత పక్షం రోజులుగా దినచర్య.

ఇది గమనించిన అజయ్‌దాస్ వీధిలో ఢంకా వాయించాడు. చిలవలు పలవలు అల్లి వక్ర సంబంధాలు కట్టాడు.

'ఛీ...ఛీ..అసభ్యం...' అన్నాడు శుద్ధ బెంగాలీలో రంజన్ కర్మకార్.

'ఇందుకే సమాజం పాడయిపోతోంది' అంది మృణాలిని మిత్రా.

'నైతికవిలువలు నశిస్తున్నాయి... కలికాలం' చిన్నసైజు లెక్చరిచ్చాడు. ముఖర్జీ.

రకరకాల పుకార్లను భరించలేక ఇంటి బయటకు రావడం మానుకుంది పినాకాని.

అఖిల్ ఆమె దర్శనానికి ఎదురుచూస్తూనే ఉన్నాడు.

× × ×

గదితలుపు శబ్దమయింది. వెళ్ళి తలుపు తీశాడు అఖిల్. ఎదురుగా పినాకిని. చేతిలో పళ్ళెం... అందులో తిలకం...రకరకాల మిఠాయిలు...

పినాకిని లోనికి వచ్చింది. 'కూర్చోండి' అంటూ గదిలో ఉన్న ఒక పాతకుర్చీని తెచ్చివేశాడు. కూర్చుంది పినాకిని. కొంతసేపు నిశ్శబ్దం. చివరకు మౌనాన్ని ఛేదిస్తూ అంది పినాకిని...“మన పరస్పర చూపుల్ని పసిగట్టిన సమాజం మనల్ని రకరకాల పుకార్ల మధ్య బంధించింది. మీరు నన్ను చూడవచ్చు అయితే మీ చూపులకు నేనెందుకు స్వాగతం పలుకుతున్నానో నాకే తెలియదు. ఇది నేను చేస్తున్న ఘోరమైన నేరం ఎందుకంటే నేను పెళ్ళయిన దాన్ని. నాభర్త ఆర్మీలో పనిచేస్తున్నాడు. అన్య పురుషుని వైపు కన్నెత్తి చూడాల్సిన పరిస్థితులకు దిగజారిన నా మనస్తత్వాన్ని సంభాళించుకోలేకపోతున్నాను. నా ఈ బలహీనత ఈ నాటితోనే సమాధి కావాలి. అందుకే స్వచ్ఛమైన మనస్సుతో ఈ 'భాయీ ఫోటా' రోజు నుదుట తిలకం దిద్దుదామని వచ్చాను. సోదరుని నుదుట దిద్దుతున్న ఈ తిలకం, యముని ద్వారానికి అడ్డంకిగా మిగులు తుందని 'భాయీ ఫోటా' అర్థం. నా పరిస్థితి అర్థం చేసుకొని మీకు తిలకం దిద్దే అవకాశం కల్పించి... మనిద్దరి మధ్య సోదర సోదరీ బాంధవ్యంతో ఈ లోకం బూతుకూతలకు శాశ్వతంగా తెరవేయించే అవకాశం కల్పించండి”.

స్వచ్ఛమైన బెంగాలీభాషలో పినాకాని అన్నది, విన్న అఖిల్ జవాబుగా “మీరు పొరబడ్డారు పినాకినిగారూ, నేను మిమ్మల్ని చూసింది కామపూరిత దృష్టితో కాదు. ప్రేమ దృష్టితో... అదీ భాతృప్రేమ. నాకు ఒకే ఒక సోదరి ఉండేది... అచ్చం మీలానే. మలేరియా సోకి చనిపోయింది. ఆమె రూపురేఖలు మీలో ప్రతిబింబించడంతో...మీరు కన్పించినప్పుడల్లా నన్ను నేను మరచిపోతూ చూస్తుండిపోతున్నాను- సోదరి తలపుల్లో మునిగితేలుతూ. మీకు కలిగించిన అవమానానికి క్షంతవ్యుణ్ణి”

పినాకిని చప్పున అఖిల్ నోరు కుడి చేతి వ్రేళ్ళతో మూసింది కొన్ని క్షణాలు...ఆ పైన అతని నుదుట తిలకం దిద్ది మిఠాయి తినిపించి 'భాయీఫోటా' శుభాకాంక్షలు అందజేసి 'ఈ రోజు మీ భోజనం మా ఇంట్లోనే' అంది.